# మోర్ స్టోర్లలో ప్రైవేటు బ్రాండ్‌లు

## వచ్చే ఏడాది నుంచి హైపర్ మార్కెట్‌లు




సమావేశంలో మాట్లాడుతున్న మోర్ ప్రతినిధులు

**న్యూస్‌టుడే-విశాఖపట్నం**

ఆదిత్య బిర్లా రిటైల్ లిమిటెడ్ నిర్వహిస్తున్న మోర్ స్టోర్లలో ఇప్పటి వరకూ ఆ సంస్థ ఆహార, కాస్మొటిక్ ఉత్పత్తులనే విక్రయించే వారు. ఇకపై కొత్తగా ప్రైవేటు బ్రాండ్ల ఉత్పత్తులను విక్రయించనున్నారు. ఈ విషయాన్ని ఆదిత్య బిర్లా రిటైల్ లి. ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) థామస్ వర్గీసే తెలిపారు. ఈ ప్రైవేటు ఉత్పత్తుల నాణ్యత, ధరలను పూర్తిగా మోర్ పర్యవేక్షిస్తుందని వెల్లడించారు. శుక్రవారం విశాఖ వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. తమవి ఆహారోత్పత్తుల విక్రయ కేంద్రాలైనందున ఆర్థిక మాంద్యం ప్రభావం లేదని పేర్కొన్నారు. అయినా ఇతరత్రా కారణాల వల్ల 55 మోర్ స్టోర్లను గత ఆరు నెలల్లో మూసివేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో 150 స్టోర్లు ఉండగా ఒక్క విశాఖలోనే 30 ఉన్నాయన్నారు. గత 16 నెలల్లో దాదాపు 500 ఉత్పత్తులను తమ స్టోర్లలో ప్రవేశపెట్టినట్లు థామస్ చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఉన్న 490 మోర్ స్టోర్‌లలో రూ.500 కోట్ల టర్నోవర్ జరిగిందన్నారు. ఈ ఏడాది 660 స్టోర్ల ద్వారా రూ.1150 కోట్ల టర్నోవర్ సాధించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం మైసూర్, బరోడాలలో మాత్రమే తమ సంస్థకు చెందిన హైపర్ మార్కెట్‌లు ఉన్నాయని, వచ్చే ఏడాది వాటి సంఖ్యను పదికి పెంచుతామన్నారు. వీటిలో రెండింటిని హైదరాబాద్ విశాఖపట్నంలలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు థామస్ తెలిపారు. 2013 నాటికి రెండు వేల స్టోర్లు ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు సీఈవో వివరించారు.